నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 4 ఆగస్టు 2024 | MAHABUBNAGAR NARAYANPET

బిజినెస్ కరస్పాండెంట్ నిర్వాకం

- రూ.14.50 లక్షలు స్వాహా
- ఖాతాదారుల ఆందోళన

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 : మండలంలోని పెద్దకారుపాముల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేందర్ నిర్వాకం వల్ల దాదాపు 10 మంది ఖాతాదారులకు సంబంధించిన రూ.14.50 లక్షలు స్వాహా అయ్యాయి. దీంతో ఖాతాదారులు శనివారం బ్యాంకుకు వచ్చి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బిజినెస్ కరస్పాండెంట్‌ను నిలదీయంతో ఆయన తాను ఖాతాదారుల వద్ద తీసుకున్న డబ్బుల ను ఆన్‌లైన్ గేమ్ ఆడి పోగొట్టానని అట్టి డబ్బులను ఖాతాదారులకు దశల వారీగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై ఎస్సై సతీశ్‌ను వివరణ కోరగా ఖాతాదారుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ నిర్వహిం చి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చాలా మంది రైతులకు తెలియకుండా ప్రైవేట్ వ్యక్తులు రు ణాలు పొందారని రైతులు ఆరోపిస్తున్నారు.

డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

- 1,600 మందికి 750 మాత్రమే హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 3: మహబూబ్‌నగర్ లోని డైట్ కళాశాలలో కొనసాగుతున్న డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలనకు ఈనెల 5 సోమవారం తుదిగడువు అని ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.మేరాజుల్లాఖాన్ తెలిపారు. 2024-26 విద్యా సంవత్సరంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో చేరేందుకు శనివారం చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభ్యర్థుల దస్త్రాలు నిశితంగా పరిశీలించారు. మొత్తం 1,600 మంది అభ్యర్థులు దస్త్రాల పరిశీలనకు హాజరుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు 750 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. మిగిలిన అభ్యర్థులు విధిగా ఈనెల 5వ తేదీ డైట్ కళాశాలలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సీతా

ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మేరాజుల్లాఖాన్

రామారావు, సిబ్బంది రోహిణి, గణేశ్, విశ్వనాథ్, ఆంజనేయులు, సృజన్‌సాగర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గని ప్రవాహం

- జూరాల 37 గేట్ల నుంచి 2,53,230 క్యూసెక్కులు విడుదల
- టీబీ డ్యాం, ఆర్డీఎస్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- శ్రీశైలం పది గేట్ల నుంచి దిగువకు కృష్ణమ్మ పరవళ్లు
- నాలుగు కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

పెబ్బేరు మండలం రంగాపురం వైపున వరద నీటిలో మునిగిన పుష్కరఘాట్లు

గద్వాల/అయిజ, ఆగస్టు 3 : కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శనివారం జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,98,000 ఇన్‌ఫ్లో రాగా 37 గేట్లు ఎత్తి దిగువకు 2,53,230 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ముమ్మరంగా కొనసాగుతున్నది. జూరాల పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా ప్రస్తుతం 318.040 మీటర్లుగా ఉన్నది. గరిష్ఠ నీటి నిల్వ 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుత నీటి నిల్వ 8.690 టీఎంసీలుగా నమోదైంది. కాగా జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తికి 21,365, నెట్టెంపాడ్ లిఫ్టుకు 750, జూరాల ఎడమ కాల్వకు 820, కుడికాల్వకు 731, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు శనివారం ఇన్‌ఫ్లో 1,32,358 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,21,508 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 98.258 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1631.10 అడుగులు ఉన్నది. అలాగే ఆర్డీఎస్ ఆనకట్టకు 1,43,700 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 1,43,120 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 580 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు..

కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 3,13,861 క్యూసెక్కులు చేరుతుండగా, అవుట్ ఫ్లో 2,75,000 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకు గానూ 1690.37 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి గరిష్ఠ నీటిమట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 70.578 ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 2,75,000 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 2,34,732 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1605.85 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 24.900 టీఎంసీలు ఉన్నది.

పుష్కరఘాట్లను ముంచెత్తుతున్న వరద

పెబ్బేరు, ఆగస్టు 3 : కృష్ణానదిలో వరద నీరు ఉరకలేస్తోంది. ప్రవాహం బాగా పెరగడంతో పెబ్బేరు మండలం రంగాపురం వద్ద ఉన్న పుష్కరఘాట్లను నీరు ముంచెత్తుతోంది. పెద్ద ఎత్తున నదిలో నీళ్లు జలసవ్వడి చేస్తూ శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్నాయి.

శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

శ్రీశైలం, ఆగస్టు 3 : శ్రీశైల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరగడంతో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి నాలుగు లక్షలకుపైగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండటంతో శనివారం డ్యాం పది గేట్లను 20 అడుగుల ఎత్తులో తెరిచి నీటి ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటి వరకు జూరాల ప్రాజెక్టు గేట్ల నుంచి 2,45,750, విద్యుదుత్పత్తి ద్వారా 17,782, సుంకేశుల నుంచి 1,67,556 క్యూసెక్కుల (మొత్తం 4,33,088 క్యూసెక్కులు) నీరు శ్రీశైలానికి విడుదల కాగా సాయంత్రం వరకు 4,24,466 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా పది గేట్లను 20అడుగుల మేర ఎత్తులో తెరచి 4,61,560, కుడి ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 61,761క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న సాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేశారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు గానూ ప్రస్తుతం 882.50 అడుగులు, పూర్తిస్థాయి నీటి నిల్వలు 215.807 టీఎంసీలకు గానూ 202.0439 టీఎంసీలుగా నమోదైంది.

ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్..

డ్యాం గేట్లు తెరవడం, సెలవులు రావడంతో హైదరాబాద్ ఘాట్ రోడ్డు మొత్తం 4 కిలోమీటర్లపైన ట్రాఫిక్ జాం అయ్యింది. కృష్ణమ్మ అందాలను యాత్రికులు సెల్ఫీలు తీసుకున్నారు.

అచ్చంపేటలో పాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు

కించపర్చడంపై కన్నెర

- సీఎం మాటలపై ప్రైవేట్ టీచర్ల ఆగ్రహం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల నిరసనలు
- వివిధ పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో డ్యూటీకి..
- అవమానకర మాటలు సరికావని ఖండన
- ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫలితాలు బేరీజు వేసుకోవాలన్న నిరుద్యోగులు
- కుటుంబ పోషణ కోసమే ప్రైవేటులో గుణాత్మక విద్యనందిస్తున్నామని వెల్లడి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 3 : ప్రైవేటు స్కూళ్లల్లో ఇంటర్ పాసైనోళ్లు.. డిగ్రీ ఫెయిలైనోళ్లే పాఠాలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అనడాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నిరుద్యోగులు, ప్రైవేటు టీచర్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు చేసినా ప్రభుత్వ ఉద్యోగాలు రాకపోవడంతో ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనే లక్ష్యంతో తాము ప్రైవేటులో పాఠాలు చెబుతూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నామని పేర్కొంటున్నారు. తమ వద్ద విద్యనభ్యసించిన ఎందరో విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో రాణిస్తున్నారని, ముఖ్యమంత్రి స్థాయిలో ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతస్థాయిలో ఉన్నవారి పిల్లలతోపాటు ప్రభుత్వ టీచర్ల పిల్లలంతా ఎక్కువ సంఖ్యలో ప్రైవేటు పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారనే విషయాన్ని సీఎం గుర్తించాలని హెచ్చరించారు. ప్రైవేటు టీచర్లుగా కొనసాగుతున్న వారంతా ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయినోళ్లు అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ టీచర్లకంటే తాము గొప్పవారం కాకపోయినా.. వారితో సమానంగా విద్యాబోధన చేస్తున్నామని అనేందుకు పోటీ పరీక్షల్లో వస్తున్న ఫలితాలే నిదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బేరీజు వేసుకున్నా.. తామేంటో ఇట్టే అవగతం అవుతుందని తమ అభిప్రాయాలు వెల్లడించారు.

మాకు చదువు రావట్లేదంటే ఎట్లా..?

నేను చదువు చెప్పిన పిల్లలు ఇప్పుడు ఇతర దేశాల్లో ఆస్ట్రేలియా, అమెరికాలో మంచి ఉన్నత స్థితిలో ఉన్నారు. మాకు చదువులు రావట్లేదంటే మరి వారెలా విదేశాల్లో రాణిస్తున్నారో సీఎం సార్ చెప్పాలి. పిల్లలకు మేము స్ఫూర్తిగా నిలుస్తున్నాం. వారి తల్లిదండ్రులు మమ్మల్ని నమ్ముకొని పంపిస్తున్నారు. ఎక్కడో ఉన్నవారి గురించి ఎందుకు.. గవర్నమెంట్ టీచర్ల పిల్లలే ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ఇది చాలాదా..! ప్రైవేటులో ఎంత నాణ్యమైన విద్య అందుతుందో.. మేం ఎంతో కష్టపడి చదువుకొని డిగ్రీలు అందుకున్నాం. అందర్ని ఒకేగాటిన కడతామంటే ఎట్లా.. ముఖ్యమంత్రి చెప్పింది కరెక్టు కాదు..

- డీ రూపవతి, ఎంఏ బీఈడీ, నవాబ్‌పేట

గుణాత్మక విద్యనందిస్తున్నాం..

నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా మెరుగైన గుణాత్మక విద్యను అందిస్తున్నాం. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది. అది ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా ఉండదు. అవకాశాలకు అనుగుణంగా కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కొందరికి రాకపోవడంతో ప్రైవేటుగా బోధిస్తున్నారు. నిరుద్యోగులను అనే ముందు ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. హైస్కూల్స్‌లో ఎక్కడైనా ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయినవారు బోధిస్తున్నారా.? అనే విషయాలు పరిగణలోకి తీసుకోకుండా అలా మాట్లాడటం సమంజసం కానే కాదు.. నిరుద్యోగులంటే అంత చులకనభావం ఏ మాత్రం పనికిరాదు.

- నీరజ, బీఎస్సీ బీఈడీ, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్

సీఎం మాటలు సరికాదు

అచ్చంపేట టౌన్, ఆగస్టు 3 : ప్రైవేట్ ఉపాధ్యాయులను అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం సరికాదని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవినాయక్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం మైదానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారని పేర్కొనడం శోచనీయమన్నారు. చాలీచాలని వేతనాలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న తమను సీఎం కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు.

రాంగ్ స్టేట్‌మెంట్ ఇవ్వొద్దు ..

సీఎం సార్ ఇలా రాంగ్ స్టేట్‌మెంట్స్ ఇవ్వొద్దు.. ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్స్ ఉన్నారు. అవసరం అనుకుంటే డీఈవో ఆఫీసుల్లో రికార్డులు తనిఖీ చేసుకోవాలి. అంతేకానీ ఇలా నిరుద్యోగులను కించపర్చేలా మాట్లాడవద్దు. ఎంఎస్సీ, బీఈడీ చేశా.. పోస్టులు తక్కువగా ఉండడంతోనే తనకు ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఖాళీలు ఉన్నాయి. వాటన్నింటినీ భర్తీ చేయండి.. అనేక రకాలైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక.. ఇలా మాట్లాడటం సరైనది కాదు.

- శిరీష, ఎంఎస్సీ బీఈడీ, మహబూబ్‌నగర్

రిజల్ట్స్ బేరీజు వేసుకోవాలి..



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల ఫలితాల వెల్లడి సమయంలో వచ్చే రిజల్ట్స్ బేరీజు వేసుకోవాలి. ఊరికే మాట్లాడితే కాదు.. మేం నాణ్యమైన విద్య అందిస్తున్నాం కాబట్టే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల్ని చేర్పిస్తున్నారు. పేరెంట్స్ పూర్తి అవగాహనతోనే అడ్మిషన్ సమయంలో టీచర్ల సీనియారిటీ, విద్యార్హత పరిశీలించి అడ్మిషన్ తీసుకుంటున్నారు. ఎంఏ, ఎంఈడీ చదివినం. జీవనోపాధిలో భాగంగా ప్రైవేటు టీచర్‌గా రాణిస్తున్నాం. నిరుద్యోగులుగా ఊరికే ఉండకుండా స్వయం ఉపాధి, సామాజిక సేవలో భాగంగా ప్రైవేటు టీచర్లుగా మారాం. అంతేకానీ ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అంటే ఎట్లా.. ఇది సరికాదు.

- నాజియా సుల్తానా, ఎంఏ ఎంఈడీ, షాషాబ్‌గుట్ట, మహబూబ్‌నగర్

ఏటీఎం చోరీకి యత్నం

- పోలీసుల రాకను పసిగట్టి పరారీ

గండీడ్, ఆగస్టు 3 : మండల కేంద్రంలో ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు కొల్లగొట్టేందుకు విఫలయత్నం చేశారు. పోలీసుల రాకతో పరారయ్యారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున సుమారు 3గంటల సమయంలో దుండగులు ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో పగులగొట్టేందుకు ప్రయత్నించారు. బ్యాంకు మేనేజర్ ఫోన్‌కు మెసేజ్ రావడంతో బ్యాంకు భవనాన్ని అద్దెకిచ్చిన ఓనర్‌కు ఫోన్ చేశాడు. ఏటీఎం దగ్గర ఏదో జరుగుతుందని, వెళ్లి చూడాలని కోరడంతో, వారు ఏటీఎం దగ్గర శబ్దాలను గమనించి ఎవరో ఉన్నారని చెప్పారు. చోరీకి ప్రయత్నిస్తున్నారని నిర్ధారించుకున్న బ్యాంకు మేనేజర్ మహ్మదాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు హుటాహుటిన బయలుదేరారు. అయితే పోలీసుల రాకను గుర్తించిన దుండగులు చోరీ ప్రయత్నాన్ని వదిలి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

ఎస్‌బీఐ ఏటీఎంను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



ఇదొక కొత్త ట్రెండు!

స్నేహమంటేనే ప్రేమలు ఉంటాయి, విభేదాలు ఉంటాయి. గొడవ పడకుండా ఉండే స్నేహం స్నేహమే కాదు. ఎన్నో కారణాల వల్ల ఫ్రెండ్‌షిప్ దెబ్బతిని విడిపోవొచ్చు. మళ్లీ కలవలేని పరిస్థితులు ఏర్పడి ఒకరంటే ఒకరు బద్ధ శత్రువులుగా మారిపోవచ్చు. మనసులో కలవాలని ఉన్నా ఇగోలు అడ్డుపడుతుంటాయి. ఈ సమస్యల పరిష్కారానికి విదేశాల్లో 'ఇన్విజిబిలియా' థెరఫీ విత్ ఫ్రెండ్ అనే ట్రెండ్‌ను మొదలుపెట్టారు. అంటే ఒక సైకాలజిస్టు విడిపోయిన ఇద్దరు స్నేహితులను కూర్చొబెట్టి రెండు, మూడు సెషన్లతో వారి స్నేహాన్ని తిరిగి చిగురింపజేస్తారు.

- మానవజన్మకు వరం చెరగని చెలిమి
- నేటి రోజుల్లో కరువైన సుమధుర స్నేహం
- హితం కంటే హాని చేసేవారే అధికం
- ఇగోలతో బీటలువారుతున్న స్నేహబంధం

స్నేహితుడా!



నేడు దోస్తుల దినోత్సవం

ఏ కారణాలతో విడిపోయినా.. ఎన్ని వివాదాలు వచ్చినా.. ఇగోలు పక్కన పెట్టి 'సారీ రా' అని ఒక్క మెసేజ్ పెట్టి చూడండి. చాలు 'సారీ' కి ఉండే పవర్ ఏమిటో మీకే అర్థం అవుతుంది.

కష్టాల్లో ఆదుకునేలా ఉండాలి..

కష్టాల్లో ఆదుకునేలా స్నేహితులు ఉండాలి. బాధ ఉన్నప్పుడు మనసు విప్పి మాట్లాడితే స్వాంతన చేకూరుతుంది. ఒక మంచిమాటతో మనసును కుదుటపడేలా చేసి ముందుకు నడిపించేది స్నేహం. కానీ నేటి రోజుల్లో చిన్నచిన్న విషయాలకే గొడవలు పడి విడిపోతున్నారు. సమాజంలో ఆధునికత్వం ఎంత పెరిగినా మనిషి మాత్రం కుంచితత్వంతోనే ఆలోచిస్తున్నాడు. దీంతో మంచి స్నేహితులు కూడా ఇగోలతో బద్ధశత్రువులుగా మారుతున్నారు. ఈ పరిస్థితులు మారినప్పుడే స్నేహం బలంగా నిలుస్తుంది.

- పృథ్వీ నాగలింగేశ్వర్, డిగ్రీ లెక్చరర్, ఆత్మకూరు

స్నేహితులకే చెప్పకుంటాం..

అమ్మానాన్నలు, అక్కాచెల్లెలతో చెప్పుకోలేని చాలా సమస్యలను స్నేహితులతో చెప్పుకుంటాం. అనుకోకుండా పరిచయమై జీవితాంతం నేనున్నా అంటూ వచ్చేది ఒక్క స్నేహమే. నిజాయితీ, నమ్మకంతో కూడిన స్నేహం కావాలి. కానీ నేడు అవసరాలకు మాత్రమే స్నేహం చేస్తున్నారు. అవి తీరగానే దూరమైపోతున్నారు. జీవితాంతం తోడు నిలిచే స్నేహం ఆనందాన్నిస్తుంది. అవసరం కోసం చేసే స్నేహం ఆపదలను తెస్తుంది.

- ఓరుగంటి కిశోర్‌కుమార్, వ్యాపారి, ఆత్మకూరు

ఆత్మకూరు, ఆగస్టు 3 : 'స్నేహానికన్న మిన్నా లోకాన లేదురా.. కడదాక నీడలాగా నిను వీడిపోదురా..' అని ఓ సినీ కవి అన్నట్లు స్నేహబంధం ఎప్పటికీ మనతోనే ఉంటూ మన జీవితంలో భాగమవుతుంది. ఆపదలో ఆదుకుంటూ.. కష్టాల్లో పక్కనుంటూ.. ఎదుగుదలలో తోడుంటూ.. ఇలా రక్తసంబంధం చేయలేనిది స్నేహబంధం చేస్తుంది. మనం విజయం సాధించినప్పుడు చప్పట్లు కొట్టేవాళ్లు.. విషాదంలో ఉన్నప్పుడు ఓదార్చేవాళ్లు నలుగురు లేని జీవితాన్ని ఎవరూ ఊహించలేరు. అందుకే మనుషులందరికీ ఒక పేరున్నట్లు అందరినీ దగ్గరకు చేర్చేది మాత్రం స్నేహబంధమే. నేటి రోజుల్లో స్నేహబంధం కమర్షియల్‌గా మారిపోతుంది. ముక్కుపచ్చలారని వయస్సులో.. పాఠశాల స్థాయిలో.. టీనేజీ వయస్సులో ఏ వయస్సులోనైనా మంచిగా ఆలోచించే స్నేహం, చెడును ఆశించే స్నేహాలు ఎదురైతున్నాయి. మన కోసం మనం ఎంపిక చేసుకునే అద్భుత బంధమే స్నేహబంధం. తల్లిదండ్రులు జన్మను.. తోబుట్టువులను ఇస్తే.. స్నేహితులను మాత్రం మన అభిరుచికి తగట్లు మనమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. అందుకే మనకు మంచి స్నేహితులు ఎవరు, నయవంచన చేసే వారెవరో గుర్తుపట్టి ఫ్రెండ్‌షిప్ చేసే పరిస్థితులొచ్చాయి. స్నేహితుల దినోత్సవం రోజున ఫేస్‌బుక్‌లో, వాట్సాప్ గ్రూపుల్లో ఫ్రెండ్‌షిప్ అంటే అది, ఫ్రెండ్‌షిప్ అం టే ఇది అంటూ పెద్దపెద్ద కొటేషన్లు పెట్టి ఊదరగొట్టడం స్నేహం కాదు. ఎదురుపడ్డ స్నేహితున్ని మన స్ఫూర్తిగా పలకరించే గుణం లేనివాడు స్నేహితుడు కాలేడు. మంచిని గుర్తించి.. చెడును దూరం పెట్టి ఆలోచిస్తేనే స్నేహం దక్కుతుంది.

స్వార్థపూరితమైన స్నేహం..

భూప్రపంచంలో ఎన్ని బంధాలు ఉన్నా స్నేహానికున్న స్థానం ప్రత్యేకమైనది. అన్నా, చెల్లి, అక్కా, తమ్ముడు, అమ్మ, నాన్న, అత్త, మామ, బావ, బావమరిది, భార్య, భర్త, ప్రియురాలు, ప్రియుడు ఇలా ఏ బంధాన్ని తీసుకున్నా స్నేహితుడి బంధం అత్యంత గొప్పగా నిర్వచిస్తారు. ప్రతి బంధానికి స్నేహంతో ముడిపడి ఉంటుంది. ఆ మాటకొస్తే పురాణాల నుంచి స్నేహమనేది ప్రత్యేక గాథలను సంతరించుకుంది. ఇంతటి గొప్ప అనిర్వచనీయ బంధమైన స్నేహబంధం నేటి ఆధునిక రోజుల్లో తీరు మార్చుకుంటుంది. ఆరోగ్యకర స్నేహం మాయమై స్వార్థ పూరిత స్నేహం పుంతలు తొక్కుతుంది. అవసరాల కోసం, ఆశల కోసం, పనికోసం, పగ కోసం, డబ్బుకోసం, దర్పం కోసం ఇలా ఎవరి లక్ష్యం వారిది. మరో భిన్నకోణం ఏమిటంటే స్నేహితుడి ఎదుగుదలను ఓర్వలేని స్నేహితులూ ఉన్నారు. పదిమందిలో మంచి పేరు వచ్చినా, ఏదైనా సాధించినా, పనికొచ్చే పని ఏది చేసినా తప్పును వెతికి మరీ తిప్పలు పెడతారు. తాను చేస్తున్నదే సరైందంటూ, అవతలి వారిని అవమానించడమే లక్ష్యంగా పేచీలు పెట్టుకుంటారు. అది ఏ వయస్సులోని స్నేహంలోనైనా మంచిని చేసే స్నేహితులకన్నా మాయమాటలు చెప్పి ముంచే స్నేహితులే ఎక్కువయ్యారు. లింగ భేదం లేకుండా అందరూ కమర్షియల్ స్నేహానికే ఎక్కువ విలువనిస్తున్నారు. శ్రీకృష్ణుడు కుచేలుడు, దుర్యోధనుడు కర్ణుడిలా స్నేహ మాధుర్యం అస్వాదించే స్నేహితులు కరువయ్యారు.

బిల్‌సే.. దోస్తానా..!

మనస్ఫూర్తిగా చేసే స్నేహం మాయమైపోతున్న ఈ రోజుల్లో దిల్‌సే దోస్తానా చేసే స్నేహితులు కూడా ఉన్నారు. సుఖంలో ఉన్నప్పుడు పలకరించకపోయినా పర్వాలేదు, కష్టంలో ఉన్నప్పుడు ఫోన్ చేసినా చాలు రెక్కలు కట్టుకొని వాలిపోయే ఆప్తమిత్రులు ఉన్నారు. చిన్ననాటి స్నేహితుడు కాని, తోటి స్నేహితుడు కాని ఏ వయస్సులో చిగురించిన స్నేహమైనా దిల్‌సే దోస్తానా అంటేనే ప్రాణమిచ్చేలా ప్రేమిస్తారు. స్నేహితుడికి ఏ కష్టమొచ్చినా నేను ఉన్నానంటూ భరోసా నిస్తూ అన్ని విధాలుగా ఆదుకునే ప్రాణస్నేహితులు ఎందరో ఉన్నారు. మంచికి, చెడుకు, పెళ్లిళ్లకు, పేరంటాలకు కుటుంబాలతో కలివిడిగా కలుస్తూ ఆనందంగా గడుపుతూ కుటుంబాల్లోనూ ఆహ్లాదకరమైన స్నేహాన్ని నెలకొలిపే నిజమైన స్నేహితులూ ఉన్నారు. ఇలాంటి వారు చేస్తున్న ఆరోగ్యకరమైన స్నేహం మూలంగానే ఇంకా నిజాయితీగల స్నేహితులు జీవన స్రవంతిలో మెలుగుతున్నారు.